# ఉర్స్ పోస్టర్ల ఆవిష్కరణ

## మున్సిపల్ వైస్ చైర్మన్ కు సన్మానం



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** ఉత్తర ప్రదేశ్‌లోని కంహరియా షరీఫ్ లో ఏప్రిల్ 1 నుండి 4వ తేదీ వరకు నిర్వహించనున్న జమాలే సైలని సర్కార్ ఉర్స్ ఉత్సవాల కు సంబంధించిన పోస్టర్ లు ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ పర్సన్ ఎండీ అహ్మద్, నిజామీ సంస్థ సభ్యులతో కలిసి విడుదల చేశారు.ఉర్స్ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా నిర్వాహకులు కోరారు. ఈ సందర్భంగా నిజామీ సంస్థ ప్రతినిధులు మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎండీ అహ్మద్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ నిసార్, నిజామీ సంస్థ ప్రతినిధులు షబ్బీర్ నిజామీ, రఫీక్ నిజామీ, అమర్ బీన్ హస్సన్ నిజామీ, జాకీర్, ముజాహిద్, అబ్దుల్ హన్నాన్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

## వాంకిడి సీఐ సత్యనారాయణ హెచ్చరిక




**ఉద్యమ కెరటం, వాంకిడి :** మండల కేంద్రంలోని పాన్ దుకాణాలే లక్ష్యంగా పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ నీతిక పంత్, ఏఎస్పీ చిత్తరంజన్ ఇచ్చిన ఆదేశాల మేరకు, సీఐ సత్యనారాయణ నేతృత్వంలో సుమారు 20 మంది పోలీసు సిబ్బందితో కలిసి ఈ దాడులు నిర్వహించారు. మండల కేంద్రంలోని అన్ని ప్రధాన కూడళ్లు, పాన్ షాపులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను విక్రయించినా, నిల్వ ఉంచినా వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సేవించడం వల్ల కలిగే తీవ్రమైన అనారోగ్య సమస్యలు, సామాజిక నష్టాల గురించి ప్రజలకు, యువతకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల రవాణా లేదా అమ్మకాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దుర్గం మహేందర్ తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా ఆంజనేయ స్వామి ఆలయ శంకుస్థాపన



**ఉద్యమ కెరటం, వాంకిడి :** మండల కేంద్రంలోని లక్ష్మీ నగర్ కాలనీలో శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు, ఆంజనేయ స్వాములకు భారీగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొని భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు.

# విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాట్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :**ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ –ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల గదులు, వంటశాల, నిత్యవసర సరుకుల నిల్వ గది, భోజనశాల, పరిసరాలను పరిశీలించి సాయంత్రం విద్యార్థులకు అందిస్తున్న స్నాక్స్ (బఠాని) రుచి చూశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ సంక్షేమ వసత గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. ఆహారం తయారీ సమయంలో తాజా కూరగాయలు వినియోగించాలని, శుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు అవసరమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

**• లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు నాంపల్లి శంకర్**




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన యువజనోత్సవాలు అత్యంత ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు నాంపల్లి శంకర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ మాట్లాడుతూ 1980 నవంబర్ 3న పంజాబ్ రాష్ట్రంలోని లూథియానాలో ఏర్పడిన డివైఎఫ్ఐ, నాటి స్వతంత్ర పోరాట యోధులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల ఆదర్శాలతో పని చేస్తోందని కొనియాడారు. కేవలం 23 ఏళ్లకే దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన ఆ మహనీయుల స్ఫూర్తితోనే, నేటి యువతకు ఉద్యోగాల భర్తీ, మహిళా హక్కులు, ఉపాధి కోసం ఈ సంస్థ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని వారు గుర్తు చేశారు. మారుతున్న సాంకేతిక కారణాలు, జీవనశైలి మరియు రాజకీయ పార్టీల స్వార్థ ప్రయోజనాల వల్ల యువత క్షణికావేశాలకు లోనై మత్తు పదార్థాలకు బానిస అవుతుండటం అత్యంత బాధాకరమైన విషయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో చాప కింద నీరులా గంజాయి, డ్రగ్స్, మద్యం, పొగాకు వంటి వ్యసనాలు విస్తరిస్తున్నాయని, వీటిని గంభీరమైన సమస్యగా గుర్తించి డివైఎఫ్ఐ దశల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. యువత సన్మార్గంలో ప్రయాణించి తమ ఉజ్వల భవిష్యత్తును తీర్చుకోవాలని వారు పిలుపునిచ్చారు.యువజనోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వ్యాస రచన, చదరంగం, కబడ్డీ పోటీలలో గెలుపొందిన విజేతలకు నాంపల్లి శంకర్, గోడిసెల కార్తీక్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గెడం టికానంద్, జిల్లా కోశాధికారి దుర్గం రాజ్ కుమార్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, టీజీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ రహీమ్, ఐద్వా జిల్లా నాయకురాలు నంది పద్మ, ఆశ్రమ పాఠశాల వార్డెన్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# సర్కార్ హామీలు ఏమాయె..?

**• పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి**




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, విద్యారంగానికి నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం చేసిందని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి మండిపడ్డారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లే కార్డు లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ. 10వేల కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రాష్ట్ర వ్యాప్త డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ ప్రొఫెషనల్ కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. విద్యా కమిషన్ 18 శాతం నిధులు కేటాయించాలని సూచించినప్పటికీ, బడ్జెట్‌లో కేవలం 8 శాతం మాత్రమే కేటాయించడం విద్యార్థులను వంచించడమేనన్నారు. ఫీజులు రాక ప్రైవేట్ కళాశాలలు సర్టిఫికెట్లు ఆపుతున్నాయని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రూ. 10 వేల కోట్ల బకాయిలతో పాటు బెస్ట్ అవైలబుల్ స్కూల్ నిధులు విడుదల చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థులు, యాజమాన్యాలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు ఐఎఫ్ ఖాన్, సమీర్, తరుణ్, అయాన్, జావీద్, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**• జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజా పాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపును సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిమ్స్ నుంచి వచ్చిన ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆప్తాల్మాలజీ తదితర విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో కిడ్నీ సంబంధిత వ్యాధులు, రక్తహీనత సమస్యలు అధికంగా కనిపిస్తున్నాయని తెలిపారు. పరిశుభ్రమైన తాగునీరు వినియోగించడం ద్వారా ఈ సమస్యలను తగ్గించుకోవచ్చని సూచించారు. ఆర్ఎంపీ వైద్యుల వద్దకు వెళ్లి అనవసరంగా యాంటీబయోటిక్స్, పెయిన్‌కిల్లర్లు వాడటంతో కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని అర్హత గల వైద్యుల సలహా మేరకే మందులు వాడాలని చెప్పారు. రక్తహీనత సమస్య ఉన్నవారు ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ టాబ్లెట్లను, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాల్లో అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం దంతన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి పనుల్లో వేగం పెంచి వర్షాకాలానికి ముందే నిర్మాణాలు పూర్తి చేయాలని అన్నారు. ఇసుక కొరత, బిల్లుల చెల్లింపులపై వివరాలు తెలుసుకుని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్యాధికారులు సాధన, మనోహర్, టిబి ప్రోగ్రామ్ అధికారి సుమలత, తహశీల్దార్ రఘునాథ్, ఎంపీడీఓ రామ్ ప్రసాద్, సర్పంచ్ అంకవ్వ, ఉప సర్పంచ్ మోబిన్, వైద్య సిబ్బంది, ఏఈలు దివ్య, వంశీ, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమంలో మట్టా దయానంద్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** సత్తుపల్లి పట్టణంలోని హనుమాన్ నగర్‌లో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి గుడి పునః ప్రతిష్ట, బొడ్రాయి ప్రతిష్ట పూజా కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదే చెన్నారావు, సీనియర్ నాయకులు దొడ్డా శ్రీను, చల్లగుళ్ల నరసింహారావు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల కుటుంబాన్ని ఆదుకుంటాం

**• జిల్లా కలెక్టర్ హరిత**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** మాజీ మావోయిస్టు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ హరిత అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించి, జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఎస్.పి. నితికా పంత్, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మత్, ఆసిఫాబాద్ ఆర్.డి.ఓ లోకేశ్వర్ రావు,తో తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆసిఫాబాద్ పట్టణం సందీప్ నగర్ కు చెందిన బోయిని నగేష్ అనే మాజీ మావోయిస్టు కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజురికి చర్యలు తీసుకుంటామన్నారు. నాగేష్ సాగు చేస్తున్న ప్రభుత్వ భూమికి లావుని పట్టా మంజూరి కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామన్నారు. నగేష్ భార్యను మహిళా సంఘాల గ్రూపులో సభ్యురాలిగా చేర్పించి బ్యాంకు రుణం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పదవ తరగతి వరకు చదివి మానేసిన నగేష్ కూతురును, పై చదువులు చదివేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు.ఈ సమీక్ష సమావేశంలో డి. ఆర్. డి. ఓ దత్తారావు, కలెక్టరేట్ పర్యవేక్షకులు జితేందర్, తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా లో లో లెవెల్ వంతెనల స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి

- **జిల్లా కలెక్టర్ కె. హరిత**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్** :జిల్లాలోని లో లెవెల్ వంతెనెల కిటికీతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని జైనూర్, సిర్పూర్ యు, లింగపూర్ మండలాలలో గల లో లెవెల్ వంతెనల స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో లో లెవెల్ వంతెనల వద్ద ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. లింగాపూర్ మండలం కాంచన్ పల్లి గ్రామపంచాయతీలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. లబ్ధిదారులు నిబంధనలకు లోబడి ఇండ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని, పనులు ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుంనూర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పిల్లల హాజరు పట్టిక, కేంద్రంలో కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. పిల్లలకు సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. అలిగూడ, గుంనూర్ నుంచి కాంచన్ పల్లి గ్రామానికి వెళ్లే దారి మధ్యలో లోలెవల్ వంతెన వద్ద వర్షాకాలంలో ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తున్న నేపథ్యంలో వాహనదారులకు అర్థమయ్యే విధంగా సూచికలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సిర్పూర్ యు మండలం మహాగం పాటెల్ గూడలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యా బోధన తీరు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. కోయినూర్ వంతెన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విదుదల పట్ల సమయపాలన పాటించాలని, ఆసుపత్రి పరిసరాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. సిర్పూర్ యు మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ను ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాలలోని గోదామును పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి సమస్య రాకుండా చూడాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జైనూర్ మండలం గౌరీ గ్రామానికి రహదారి మధ్యలో గల లోలెవల్ వంతెనను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల ఫలితాల్లో తేజాపూర్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. ఇటీవల నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్షల్లో మండలంలోని తేజాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన రమ్య, హర్షవర్ధన్, సహస్ర గురుకుల విద్యాలయాల్లో సీట్లు సాధించడం గర్వకారణమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్ అన్నారు. ఈ విద్యార్థులు సాధించిన విజయం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా తేజాపూర్ పాఠశాల నుంచి మరింత మంది విద్యార్థులు ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు పవన్, నిరోషా, విద్యార్థులను అభినందించారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ వారి భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించారు.

# పట్ట ణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

**మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్**



**ఉద్యమ కెరటం,అసిఫాబాద్:** ఆసిఫాబాద్ పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో జర్నలిస్టులు అసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్‌ను పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ మాట్లాడుతూ జర్నలిస్టులు తనపై చూపిస్తున్న ప్రేమ, అభిమానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో వారు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. మున్సిపల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే కోవ లక్ష్మి , మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్ , కౌన్సిలర్ల సహకారంతో త్వరలోనే పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. వార్తల సేకరణలో, ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టులకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సియాసత్ స్టాఫ్ రిపోర్టర్ అబ్దుల్ జమీల్ , ప్రజా పక్షం ఆర్ సి షఫీ ఉల్లా బేగ్, వార్త ఆర్ సి శ్రీధర్ , అబ్దుల్ హన్నన్ జర్నలిస్టు, సియాసత్ ఆసిఫాబాద్ రిపోర్టర్ అబ్దుల్ గఫ్ఫార్, ఉద్యమ కెరటం ఆసిఫాబాద్ రిపోర్టర్ మిలిన్, రిపోర్టర్ షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టు లతో ఉద్యమాలను ఆపలేరు



**ఉద్యమ కెరటం, జైనూర్:** అక్రమ అరెస్టులతో గిరిజన లంబాడీల ఉద్యమాలను ఆపలేరని లంబాడా నాయకుడు పవార్ పితా నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహంతో పాటు టాను నాయక్ విగ్రహాన్ని హైదరాబాద్ నగరంలోని ట్యాంక్ బండ్‌పై ప్రతిష్టించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. గిరిజనులకు న్యాయం చేయకపోతే ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గిరిజనుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలి

- **ఏకలవ్య మోడల్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం ఇంద్రవెల్లి మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతులు, విద్యార్థుల హాజరు పట్టిక, భోజన మెనూ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం వసతి గృహంలో పలువురు విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న భోజన నాణ్యత, వసతి గృహ సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఇంగ్లీష్ భాషతో పాటు సబ్జెక్టులపై మంచి పట్టు సాధించాలని సూచించారు. వారికి పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, పారిశుధ్య విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని ఆదేశించారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించేలా ప్రోత్సహించాలని తెలిపారు. పాఠశాల ఆవరణలోని వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతులు చేపట్టి త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. అంతకుముందు వంట గది, సరుకు నిల్వల గది, భోజనశాల, వసతి గృహాలను పరిశీలించారు. పాఠశాలలో అవసరమైన స్పోర్ట్స్ షూస్, గ్రిజర్స్ తదితర సౌకర్యాలకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహశీలార్ ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ రేఖ రాణి, డీఈ శివ ప్రసాద్, పీఈటీ సరిత, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రక్తదానంతో గర్భిణీ ప్రాణాలను కాపాడిన అజయ్



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ పట్ట ణంలోని షణ్ముఖ ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితిలో ఉన్న గర్భిణీ ప్రాణాలను రక్షించడానికి ఓ–పాజిటివ్ రక్తాన్ని దానం చేసి వేల్పుల అజయ్ ఉదారత చాటుకున్నారు. అత్యవసర సమయంలో అందించిన రక్తదానంతో గర్భిణీ ప్రాణాలు నిలిచాయి. సమాజంలో ఇలాంటి సేవా దృక్పథం కలిగిన వ్యక్తులు ఉండటం గర్వకారణమని స్థానికులు అభిప్రాయపడ్డారు. వేల్పుల అజయ్ అందరికీ ఆదర్శమని, ప్రతిఒక్కరు రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పలువురు కోరారు. అత్యవసర సమయంలో ముందుకొచ్చి రక్తదానం చేసిన అజయ్‌ను ఆసుపత్రి సిబ్బంది, స్థానికులు అభినందించారు.

# ఉస్మాన్‌పూర్‌లో పడకేసిన పారిశుధ్యం

- **కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం**
- **దుర్వాసనతో అవస్థలు పడుతున్న జనాలు**

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రంలోని ఉస్మాన్‌పూర్ ప్రాంతంలో పారిశుధ్యం పడకేసింది. ముఖ్యంగా 14వ వార్డులో కాలువలు చెత్తతో నిండిపోవడంతో నీటి ప్రవాహం ఆగిపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. ఖాళీ ప్రదేశాలు చెత్త నిల్వ కేంద్రాలుగా మారిపోవడం ఆందోళనకరంగా మారింది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు, గృహ వ్యర్థాలు పేరుకుపోవడంతో పర్యావరణానికి హాని కలుగుతోంది. కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది వ్యాధులకు కారణంగా మారుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక 14వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణం కోసం సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వాడల్లో చెత్త బండ్లను ఏర్పాటు చేసి వెంటనే చెత్త తొలగింపు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామ అభివృద్ధికి పరిశుభ్రత అత్యంత ముఖ్యమని, లేకపోతే భవిష్యత్తులో ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తునానరు.





# భవిత కేంద్రం సేవలు వినియోగించుకోవాలి



- **జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **ఎల్లా రెడ్డిపేటలో భవిత కేంద్రం ప్రారంభం**

**ఉద్యమ కెరటం, ఎల్లా రెడ్డిపేట:** దివ్యాంగ విద్యార్థులు భవిత కేంద్రం సేవలు వినియోగించుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో భవిత కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. భవిత కేంద్రం పరిధిలో మొత్తం ఎందరు దివ్యాంగులు ఉన్నారు.? ఏ ఏ సేవలు వారికి అందిస్తారో ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో భవిత కేంద్రం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ప్రతి బుధ, గురువారం ఐఈఆర్పీ, ఫిజియోథెరపిస్ట్ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం మండల సమాఖ్య భవనాన్ని పరిశీలించి, ఎందరు సభ్యులు ఉన్నారని, స్వయం ఉపాధి, సంఘాల ఆర్థిక కార్యకలాపాలపైన ఆరా తీశారు. అక్కడి నుంచి జూనియర్ కళాశాల మైదానంలో పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సాబేరా బేగం, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, తహశీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య, ఎంఈఓ కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ దేవాలయం వద్ద బోరు బావికి భూమి పూజ



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని రేపల్లెవాడలోని హనుమాన్ దేవాలయం వద్ద బుధవారం బోరు బావి ఏర్పాటు కోసం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి నాయకత్వంలో కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఆకుల వెంకటేష్ చేతుల మీదుగా భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హనుమాన్ దేవాలయానికి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఈ బోరు బావి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. డీఎంఎఫ్టీ నిధులతో ఈ బోరు బావిని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎంపీడీఓ పి.శ్రీనివాస్, ఎంపీఓ అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి మెరుగు లక్ష్మణ్, ఉప సర్పంచ్ కొల్లూరి సంగీత, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేతన్నల కష్టాలపై డిప్యూటీ సీఎంను కలిసిన కేటీఆర్



**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న విద్యుత్ సంక్షోభంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) స్పందించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావులను బుధవారం కలిసి నేతన్నల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. సిరిసిల్లలోని పవర్‌లూమ్ యూనిట్లపై విధించిన బ్యాక్ బిల్లింగ్, సర్‌చార్జిల కారణంగా భారీ ఆర్థిక భారం పడిందని వివరించారు. 2016 నుంచి 2024 వరకు 127 ఎస్ఎస్ఐ యూనిట్లపై సుమారు రూ.19 కోట్ల బ్యాక్ బిల్లింగ్ విధించగా, సర్‌చార్జిలతో కలిపి అది రూ.38 కోట్లకు పెరిగిందని తెలిపారు. ఈ భారం కారణంగా అనేక యూనిట్లు మూతపడగా, కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. సిరిసిల్లను రాష్ట్ర వస్త్ర పరిశ్రమకు గుండెకాయగా పేర్కొన్న ఆయన, గతంలో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలను గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా ఇలాంటి పరిస్థితులు మళ్లీ రావొచ్చనే ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల 13 మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ఉన్న బ్యాక్ బిల్లింగ్, సర్‌చార్జిలను పూర్తిగా మాఫీ చేయాలని, పాత బకాయిలతో సంబంధం లేకుండా నిరంతరాయ విద్యుత్ సబ్సిడీ అందించాలని, కార్మికులకు తక్షణ ఆర్థిక సహాయం కల్పించాలని కోరారు. నేతన్నల సమస్య కేవలం ఒక ప్రాంతానిది కాదని, వేలాది కుటుంబాల జీవనాధారమని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎమ్మెల్సీ ఎల్.రమణ ఉన్నారు.

# డంపింగ్ యార్డ్ తొలగించే వరకు పోరాటం



**ఉద్యమ కెరటం, హనుమకొండ:** మడికొండలో ఉన్న డంపింగ్ యార్డ్ ద్వారా ప్రజలు ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, దీనిని తొలగించే వరకు పోరాటం ఆగదని ఎంసీపీఐ(యు) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్. రెడ్డి హంసారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఎంసీపీఐ(యు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మడికొండ–రాంపూర్ ప్రాంతాల మధ్యనున్న డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మడికొండ యార్డులో చెత్తగుట్టలు పేరుకుపోయి విష రసాయనాలు వెలువడుతూ మంటలు చెలరేగుతున్నాయని తెలిపారు. అక్కడి నుంచి వెలువడుతున్న పొగతో మడికొండ, రాంపూర్, ఎలుకుర్తి, నర్సింగరావుపల్లి, అయోధ్యపురం, కుమ్మరిగూడెం, టేకులగూడెం, బాపూజీనగర్, డీజిల్ కాలనీ, కడిపికొండ, తరాలపల్లి ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛ వరంగల్ పేరుతో చెత్త శుద్ధికరణ గురించి అధికారులు గొప్పలు చెప్పుకుంటున్నా, వరంగల్–హనుమకొండ నగరాల్లో రోజూ పోగవుతున్న చెత్తను నిల్వ చేసేందుకు సరైన డంపింగ్ యార్డులు లేకపోవడం సమస్యగా మారిందన్నారు. గత 11 ఏళ్లుగా రాంపూర్ డంపింగ్ యార్డ్ ఒక్కటే ఆధారంగా ఉందని విమర్శించారు. ప్రతిరోజు సుమారు 480 టన్నుల చెత్త రాంపూర్ డంపింగ్ యార్డ్‌కు చేరడంతో అది పూర్తిగా నిండిపోయిందని అన్నారు. ప్రస్తుతం అక్కడ సుమారు నాలుగు లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందని తెలిపారు. నెలరోజులుగా వెలువడుతున్న పొగ, విషవాయువుల వల్ల గాలి, నీరు, నేల కాలుష్యం బారిన పడుతూ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. డంపింగ్ యార్డ్ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని, సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైల్వే జేఏసీ చైర్మన్ కొండ్ర నర్సింగరావు, వైస్ చైర్మన్ జి.భాస్కర్, ఎంసీపీఐ(యు) హనుమకొండ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ బంకులను తనిఖీ చేసిన తహశీల్దార్

**ఉద్యమ కెరటం, హత్నూర:** మండలంలోని పలు పెట్రోల్ బంకులను బుధవారం హత్నూర తహశీల్దార్ పర్వీన్ షేక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బంకుల్లో ఉన్న ఇంధన నిల్వల రిజిస్టర్లు, నిల్వలు చేసే ప్రదేశాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కొన్నిచోట్ల ఇంధనం లేకపోవడం గమనించిన తహశీల్దార్ బంకు యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ సరిపడా నిల్వలు ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఇంధనం కొరత పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే బంకు యజమానులకు నోటీసులు జారీ చేసి శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# సర్పంచ్ భర్త కిడ్నాప్ కలకలం



**ఉద్యమ కెరటం, ఖమ్మం:** ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలో సర్పంచ్ భర్త కిడ్నాప్‌కు గురైన ఘటన కలకలం రేపింది. పండ్రేగుపల్లి గ్రామ సర్పంచ్ పాము స్వర్ణలత భర్త పాము సిల్వరాజును బుధవారం తెల్లవారుజామున దుండగులు కారులో ఎత్తుకెళ్లినట్లు సమాచారం. సుమారు 5.30 గంటల ప్రాంతంలో వాకింగ్‌కు వెళ్లిన సిల్వరాజు ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. గ్రామంలో విచారించగా, కొందరు వ్యక్తులు కారులో తీసుకెళ్లడం చూశామని గ్రామస్థులు తెలిపారు. అయితే కారులో ఉన్నవారు తెలిసిన వారేనేమోనని భావించి పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఉదయం వెళ్లిన వ్యక్తి ఇంకా ఇంటికి రాకపోవడంతో కిడ్నాప్ చేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సర్పంచ్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

# పెట్రోల్ బంక్‌ల ఆకస్మిక తనిఖీ

**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ పట్టణంలోని పలు పెట్రోల్ బంక్‌లను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరంగా ఇంధన సరఫరా అందించాలని సూచించారు. జీసీసీ పెట్రోల్ బంక్‌ను పరిశీలించి అక్కడి ప్రాథమిక సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలను నిర్వహించాలని పేర్కొన్నారు. ఇంధన నిల్వలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ కొరత ఏర్పడకుండా చూడాలని ఆదేశించారు. "నో స్టాక్" బోర్డులు పెట్టకుండా ప్రజలకు నిరంతరంగా ఇంధన సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.



# ఉద్యాన నర్సరీల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటిడీఏ) ఉట్నూర్ పరిధిలోని ఉద్యాన నర్సరీల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ తెలిపారు. బుధవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండల కేంద్రంలోని వంద ఎకరాల తోటను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యాన నర్సరీలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని రాజంపేట ప్రాంతాల్లోని ఉద్యాన నర్సరీలను అధికారులు ఆకస్మికంగా సందర్శించి పర్యవేక్షించాలని సూచించారు. ఈ ఏడాది ఆగ్రో ఫారెస్ట్రీ, నేషనల్ బ్యాంబు (వెదురు) మిషన్ కార్యక్రమాల్లో భాగంగా రూ.2 కోట్ల నిధులతో నర్సరీల్లో మొక్కల పెంపకం చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన మొక్కలను నాణ్యత ప్రమాణాలతో తక్కువ ధరకు అందుబాటులో ఉంచుతామని, మామిడి, వెదురు తదితర పండ్ల మొక్కలు, అలంకరణ మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# పెట్రోల్, డీజిల్ కొరత లేదు



**• వదంతులు నమ్మవద్దు: జిల్లా ఎస్పీ నితిక పంత్**

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని జిల్లా ఎస్పీ నితిక పంత్ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వ్యాపిస్తున్న వదంతుల కారణంగా ప్రజలు ఆందోళనకు గురవుతూ పెట్రోల్ బంకుల వద్ద రద్దీ పెరుగుతోందని తెలిపారు. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, సరఫరా నిరంతరం కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రజలు అవసరానికి మించిన ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దని సూచించారు. అలాగే సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు వార్తలు, వదంతులను నమ్మవద్దని, ధృవీకరించని సమాచారాన్ని పంచుకోవద్దని చెప్పారు. వదంతులు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సాధారణ అవసరాలకే ఇంధనాన్ని వినియోగించుకోవాలని, ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని వివరించారు.

# పీఎంశ్రీ పాఠశాలలో మాక్ పార్లమెంట్



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని రేచిని పీఎంశ్రీ జెడ్‌పీహెచ్ఎస్ రేచిని పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థ, భారత పార్లమెంట్ పనితీరుపై అవగాహన కల్పించేందుకు మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు స్పీకర్, ప్రధాన మంత్రి, మంత్రులు, ప్రతిపక్ష నాయకులు, ఎంపీలు వంటి పాత్రలను పోషిస్తూ బడ్జెట్‌పై చర్చ, ఆమోదం, ప్రశ్నోత్తరాల సమయం, ప్రజా సమస్యలపై చర్చలు వంటి పార్లమెంటరీ విధానాలను ప్రదర్శించారు. దీని ద్వారా విద్యార్థులు ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, వేదికపై మాట్లాడే నైపుణ్యం, పాలనలో ప్రజల పాత్ర వంటి అంశాలపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ప్రదీప్ విద్యార్థుల ప్రదర్శనను అభినందిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కలిగి బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి నివారణపై కళాజాత ప్రదర్శన



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** బెజ్జూర్ మండల కేంద్రంతో పాటు ఎలకపల్లి గ్రామంలో కుష్టు వ్యాధిపై ప్రజల్లో కళాజాత ప్రదర్శనలు నిర్వహించారు. లెప్రసీ సొసైటీ హైదరాబాద్ సౌజన్యంతో, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ లెప్రసీ సొసైటీ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జన్నె యుగేందర్ కళా బృందం సభ్యులు పాటలు, నాటకాలు, సందేశాత్మక ప్రదర్శనల ద్వారా కుష్టు వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, చికిత్స, నివారణ మార్గాలపై గ్రామ ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించారు. ప్రజలు వ్యాధి పట్ల భయపడకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఓ రాములు నాయక్, గ్రామ సర్పంచ్ దుర్గం సరోజన, కౌన్సిలర్ రాజు ముఖ్య అతిథులుగా పాల్గొని కళాకారులను అభినందించారు. కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. కాగా కళాకారులు పుల్ల ప్రతాప్, బత్తుల ఉపేందర్, కట్కూరి రాజు తమ ప్రతిభతో ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గిరిజన గ్రామాల్లో సోలార్ లైట్లు



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో సోలార్ లైట్లు ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్ తెలిపారు. జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టెబ్రివాల్ ఆదేశాల మేరకు డివిజన్ అటవీ శాఖ అధికారి అప్పయ్య పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. అటవీ శాఖ ప్రజల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా గిరిజన గ్రామాల్లో సోలార్ దీపాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అటవీ సంపద పరిరక్షణలో భాగంగా ఇటీవల గిరిజన గ్రామాల్లో ఉచితంగా గ్యాస్ రీఫిల్లింగ్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ఇందిరిగాం, రేచిని, గబ్బాయి, తలాయి గ్రామాల్లో సోలార్ లైట్లు అమర్చినట్లు చెప్పారు. దీంతో గ్రామాల్లో రాత్రి వేళల్లో వెలుతురు సమస్య కొంత మేర తగ్గి ప్రజలకు సౌకర్యం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, అటవీ శాఖ సిబ్బంది, సెక్షన్ అధికారి సఫియా బేగం, బీట్ అధికారులు స్రవంతి, వెంకటేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# చరణ్ గౌడ్‌కు ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్ గౌడ్‌ను బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీచైర్మన్, వనపర్తి డీసీసీ అధ్యక్షులు, మాజీ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివసేన రెడ్డి ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 40వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్‌గా భారీ మెజారిటీతో విజయం సాధించిన సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని సూచించారు. అనంతరం చరణ్ గౌడ్ మాట్లాడుతూ తన అభిమాన నాయకుడు శివసేన రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తాను కౌన్సిలర్‌గా ఎన్నికైన సందర్భంగా పెద్దలు ఆత్మీయంగా అభినందిస్తూ శాలువా కప్పి సత్కరించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. క్లిష్ట సమయాల్లో ఎప్పటికప్పుడు వెన్నంటి ఉండి మార్గనిర్దేశం చేసే శివసేన రెడ్డి ప్రోత్సాహం తనలో మరింత ఉత్సాహాన్ని నింపిందని పేర్కొన్నారు.

